క్లుప్తంగా

అండర్‌పాస్ బ్రిడ్జి పరిశీలన



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీవో రత్నకళ్యాణి

సోన్: మండలంలోని కడ్తాల్ సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఇటీవల నిర్మించిన అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణంపై ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాలతో సోమవారం నిర్మల్ ఆర్డీవో రత్నకళ్యాణి అండర్‌పాస్ బ్రిడ్జిని పరిశీలించారు. అనంతరం రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, ఆర్టీసీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యను త్వరలో పరిష్కరిస్తామన్నారు. తహసీల్దార్ మల్లేశ్, ఎంపీడీవో సురేష్, ఆర్ఐ షేక్ రఫీక్ తదితరులు ఉన్నారు.

'ధర్నా విజయవంతం చేయండి'



మాట్లాడుతున్న ప్రభాకర్, గోపి

నిర్మల్‌టౌన్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు నిరసిస్తూ హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈనెల 4న జిల్లాకేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపట్టే ధర్నా విజయవంతం చేయాలని వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి మూర్తి ప్రభాకర్, అయ్యప్ప దీక్ష జిల్లా అధ్యక్షుడు కోటగిరి గోపి కోరారు. జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బుధవారం ఉదయం 10 గంటలకు జరిగే ధర్నాలో హిందూ బంధువులు, అయ్యప్ప, భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఇందులో నాయుడి రమేశ్, విశాల్, రఘు, శ్రీకాంత్, కరణ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని చాణిక్య హైస్కూల్ విద్యార్థులు సోమవారం నిర్మల్ మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించారు. శానిటేషన్, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, బర్త్, డెత్, రెవెన్యూ పలు విభాగాలను పరిశీలించారు. కార్యాలయ విధులు, హక్కులను మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ విద్యార్థులకు వివరించారు. మున్సిపల్ పరిపాలన విధానాన్ని తెలియజేశారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



గేదె కళేబరం

కుంటాల: కుంటాల శివారులో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో సోమవారం గేదె మృతి చెందింది. గేదె మేత మేస్తుండగా విద్యుత్ స్తంభానికి గల సపోర్ట్ తీగకు సరఫరా మృతిచెందిందని బాధిత రైతు ఎల్ల రాములు తెలిపారు. దీని విలువ రూ.65 వేలు ఉంటుందని, నష్టపరిహారం అందించాలని కోరాడు.

విద్యార్థుల హాజరుశాతం పెంచాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో

లోకేశ్వరం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెంచాలని ఎంఈవో చంద్రకాంత్ అన్నారు. మండలంలోని అర్లి, గొడిసెరా, వట్టోలి గ్రామాల్లోని ప్రాథమికోన్నత పాఠశాలలను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం, పరిసరాలు, తాగునీరు, మరుగుదొడ్లను పరిశీలించారు. హెచ్‌ఎంలు ఆలగట్ల శ్రీనివాస్, మదుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రయాణం.. నరకప్రాయం



కన్నపూర్ సమీపంలో లేచిపోయిన తారు రోడ్డు



కన్నపూర్-ఆష్టా తారు రోడ్డుపై ఏర్పడిన గుంత

- ఐదేళ్లకే చెదిరిన తారు రోడ్డు
- గుంతలు పడ్డ రహదారులు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు

లోకేశ్వరం: గ్రామీణ రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారింది. మండలంలోని కన్నపూర్ నుంచి ఆష్టా వరకు 2017–18లో ఎస్‌డీఏఫ్ నిధులు రూ.1.50 కోట్లతో తారు రోడ్డు నిర్మించారు. ఐదేళ్ల క్రితం నిర్మించిన రోడ్డు కంకర తేలి, గుంతలమయంగా మారింది. ఈరోడ్డుపై రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోంది. ఈఏడాదిలో కురిసిన భారీ వరదలకు రోడ్డు కోతకు గురయ్యాయి. అక్కడక్కడ పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వాహనదారుడు ఓ గుంతను తప్పించే క్రమంలో మరో గుంతలో పడి గాయాలపాలయ్యాడు.

పట్టించుకోని అధికారులు

ఈరోడ్ల దుస్థితిపై అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. గ్రామాలకు ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు వెచ్చిస్తున్నా పీఆర్ రోడ్లపై సవతి ప్రేమ చూపుతోంది. ఇప్పటికైనా అధికారులు రోడ్లకు మరమ్మతు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మరమ్మతు చేపట్టాలి



హవర్గ-హద్‌గాం వరకు రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డు గుండా ప్రయాణించాలంటే భయమేస్తోంది. అధికారులు వెంటనే రోడ్డుకు మరమ్మతు చేపట్టాలి.- గిర్మాయి చిన్న దేవన్న, కన్నపూర్

నిధులు మంజూరు కాగానే..

కన్నపూర్-ఆష్టా రోడ్లపై గుంతలు పడ్డాయి. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఇది వరకే నివేదించాం. నిధులు మంజూరు కాగానే వెంటనే మరమ్మతు పనులు ప్రారంభిస్తాం.

– క్రాంతికుమార్, పీఆర్ ఏఈ, లోకేశ్వరం

తానూరు, బాసర, కుభీర్‌కు అంబులెన్స్‌లు

భైంసాటౌన్: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి 213 నూతన అంబులెన్స్ సర్వీసులను ప్రారంభించారని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు జి.విఠల్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ముధోల్ నియోజకవర్గంలోని తానూరు, బాసర, కుభీర్ మండల కేంద్రాలకు కొత్తగా 108 అంబులెన్స్ సర్వీసులు మంజూరైనట్లు పేర్కొన్నారు. దీంతో ఆయా మండల వాసులకు అత్యవసర సమయాల్లో అంబులెన్స్ సేవలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ధన్యవాదాలు తెలిపారు.

నర్సాపూర్, లక్ష్మణచాందలకు..

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా నిర్మల్ నియోజకవర్గంలోని నర్సాపూర్, లక్ష్మణచాంద మండల కేంద్రాలకు 108 అంబులెన్స్ సర్వీసు మంజూరైనట్లు డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకి ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖానాపూర్: ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ రాష్ట్ర నాయకుడు రితీష్ రాథోడ్ ఆరోపించారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనంలో పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సోమవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. బూటకపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. అంతకుముందు ప్రభుత్వ వైఫల్యాలపై పార్టీ నుంచి వచ్చిన కరపత్రాలను ఆవిష్కరించారు. నాయకులు టేకు ప్రకాశ్, నాయిని సంతోష్, ఆకుల శ్రీనివాస్, రవీందర్, ఉపేందర్, లక్ష్మణ్, శీను, రవి, రమేశ్ తదితరులు ఉన్నారు.

నేడు పత్తి కొనుగోళ్లు నిలిపివేత

సారంగాపూర్: మండలకేంద్రంలోని కేదారినాథ్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో సీసీఐ పత్తి కొనుగోళ్లు మంగళవారం నిలిపివేస్తున్నామని ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హాదీ తెలిపారు. వాతావరణంలో మార్పులు, వర్షం హెచ్చరికల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు.

కాంగ్రెస్ ఏడాది పాలనపై చార్జిషీట్



చార్జిషీట్ విడుదల చేస్తున్న బీజేపీ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: గడిచిన ఏడాది కాంగ్రెస్ పాలన ఆరు అబద్దాలు 66 మోసాలుగా సాగిందని బీజేపీ సీనియర్ నాయకుడు రావుల రాంనాథ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఏడాది వైఫల్యాలపై సోమవారం నిర్మల్ పార్టీ కార్యాలయంలో ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ అయ్యనగారి భూమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసమ్మె రాజులతో కలిసి చార్జిషీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తప్పుడు వాగ్దానాలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన ఇప్పటికి కూడా ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. జిల్లాలో 50 శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదని ఒక్క సోన్ మండలంలోనే 2 వేల మంది ఉన్నారని తెలిపారు. ఏటా రైతుభరోసా కింద రైతులు, కౌలురైతులకు ఎకరాకు ఇస్తామన్న రూ.15 వేలు ఇప్పటికి ఇవ్వలేదన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ప్రతి నెలా రూ.2500 ఆర్థికసాయం ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ఇళ్లు లేని నిరుపేదలకు తొలిదశలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరుతోపాటు స్థలం లేని వారికోసం ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం చేస్తామని చెప్పి ఇంతవరకు అడుగుమందుకు పడలేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లికార్జున్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడే రాజేందర్, జిల్లా ఉపాధ్యక్షురాలు అలివేలు మంగ, జిల్లా కార్యదర్శి కోరిపల్లి శ్రావణ్‌రెడ్డి, నాయకులు ఆడెపు సుధాకర్, వడ్డే రాజేందర్‌రెడ్డి, నూతుల భూపతిరెడ్డి, పాడెల్లి గణేశ్, కొండా విశ్రావన్, తోట సత్యనారాయణ, కౌన్సిలర్లు నరేందర్, నవీన్, పద్మాకర్ పాల్గొన్నారు.





యాసంగి సాగుకు సన్నద్ధం

యాసంగి సాగుకు రైతులు సన్నద్ధమయ్యారు. పంట పొలాలను చదును చేసే పనిలో బిజీబిజీగా ఉన్నారు. పలుచోట్ల మొక్కజొన్న విత్తనాలు వేస్తున్నారు. దిలావర్‌పూర్ మండలం గుండంపెల్లి, దిలావర్‌పూర్‌లో రైతులు పనిచేస్తూ కనిపించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

హంస ఆకృతిలో బొప్పాయి



నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలోని నటరాజ్‌నగర్ కాలనీలో మానిక కొనుగోలు చేసిన బొప్పాయి హంస ఆకృతిలో దర్శనమిచ్చింది. అచ్చం హంస మెడ, ముక్కు, రెక్కలు కలిగి ఉండడంతో కాలనీవాసులు ఆశ్చర్యపోయారు. బొప్పాయి పండ్లు మొలకెత్తే క్రమంలో కొన్ని వివిధ ఆకృతులు సంతరించుకునే అవకాశం ఉందని వృక్ష శాస్త్ర నిపుణులు చెబుతున్నారు.

800 కి.మీ చేరిన పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న అయ్యప్ప స్వాములు

నిర్మల్‌టౌన్: నిర్మల్ నుంచి జి.శ్రీనివాస్‌స్వామి ఆధ్వర్యంలో 50 మంది అయ్యప్ప స్వాములు శబరికి పాదయాత్ర చేపట్టారు. ఇందులో భాగంగా పాదయాత్ర సోమవారం 22వ రోజు 800 కి.మీ చేరుకుంది. ప్రస్తుతం కర్ణాటక రాష్ట్రంలో కొనసాగుతోంది. వర్షాన్ని లెక్కచేయకుండా స్వాములు పాదయాత్ర కొనసాగిస్తున్నారు.

బాధితులకు అండగా ఉంటా



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రామారావుపటేల్

భైంసాటౌన్: బాధిత కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. పట్టణంలోని ఎస్ఎస్ కాటన్‌లో సోమవారం పలువురికి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేశారు. ముధోల్ మండలంలోని ఎడ్‌బిడ్‌కు చెందిన గంగన్నకు రూ.30 వేలు, చిన్న సర్సుకు రూ.13,500, తానూర్ మండలంలోని మహాలింగికి చెందిన భోజన్నకు రూ.58,500, కుంటాల మండలంలోని కల్లూరుకు చెందిన ఎం.సంతోషికి రూ.12 వేలు, భైంసా మండలంలోని దేగాంకు చెందిన నారాయణకు రూ.16 వేలు, లోకేశ్వరం మండలంలోని హద్గాంకు చెందిన సీతారాంకు రూ.43,500, రాహుల్‌కు రూ.13వేలు చెక్కులు మంజూరు కాగా, ఈ మేరకు ఆయన బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకోవాలి

- డీఎంహెచ్‌వో రాజేందర్



ప్రశంసాపత్రం అందుకుంటున్న స్టాఫ్‌నర్సు

నిర్మల్‌చైన్‌గేట్: ఎయిడ్స్ పట్ల ప్రజలు అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని డీఎంహెచ్‌వో రాజేందర్ తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు చికిత్స అందుతుందన్నారు.

ఉత్తములకు అవార్డులు..

ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం పురస్కరించుకొని వైద్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం వైద్య వృత్తిలో ప్రతిభ కనబర్చిన వైద్యులు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్ల 20 మందికి ప్రశంసాపత్రాలు, సర్టిఫికెట్లు అందజేశారు. వీరితోపాటు ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన చిత్రలేఖనం, పెయింటింగ్‌లో ప్రతిభకనబర్చిన మరో 20 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రోగ్రాం ఆఫీసర్ రవీందర్‌రెడ్డి, మాస్ మీడియా అధికారి రవీందర్, వైద్యశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



నిర్మల్‌రూరల్: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్



సోన్: గెలుపొందిన విద్యార్థులతో, ఎంఈవో ఉపాధ్యాయులు

నిర్మల్‌రూరల్: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మున్సిపల్ ఆధ్వర్యంలో మంజులాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆరు గ్యారంటీలపై పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రథమ బహుమతి రితిక, శివాని(ద్వితీయ), ఇందు (తృతీయ) గెలుచుకున్నారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవిదాస్, హెచ్‌ఎం సిద్ధ పద్మలు విజేతలకు బహుమతులు అందజేశారు. అంతకుముందు పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను ట్రాక్టర్ సహాయంతో తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో సోమవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోన్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ×పునరుత్పాదక శక్తి వనరులు×అనే అంశంపై క్విజ్‌పోటీలు నిర్వహించారు. ఏడు పాఠశాలల నుంచి 8, 9, 10వ తరగతుల విద్యార్థులు క్విజ్ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో పరమేశ్వర మాట్లాడుతూ విద్యార్థులు పునరుత్పాదక ఇంధన వనరుల ప్రాముఖ్యతను గుర్తించాలన్నారు. ఈ పోటీలో సోన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రిషిత, ధనిష్ మహిమాన్విత ప్రథమ బహుమతులు అందజేశారు. ద్వితీయ స్థానంలో సిద్దులకుంట ఉన్నత పాఠశాల విద్యార్థులు నిలిచారు. హెచ్‌ఎం కె.ఆరాధన, ఉపాధ్యాయులు అశోక్ కుమార్, మధుసూదన్ దేశ్ పాండే, భీమేశ్వర్, రమాదేవి, సంజయ్, ముత్తన్న, భూమారెడ్డి పాల్గొన్నారు.

సారంగాపూర్: మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, జామ్ గ్రామంలోని కేజీబీవీ, గురుకులం, స్వర్ణ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు సోమవారం ఆటల పోటీలు నిర్వహించారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, పరుగు, చదరంగం పోటీల్లో పాల్గొన్నారు. ఎంఈవో మధుసూదన్, హెచ్‌ఎంలు రాధిక, విజయ్‌కుమార్, అన్నపూర్ణ, శంకర్ తదితరులు ఉన్నారు.

పాఠశాలలో 'బాలశక్తి'

మామడ: మండలంలోని పొన్కల్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో సోమవారం బాలశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బంది విద్యార్థుల బరువు, ఎత్తు, హిమోగ్లోబిన్ శాతం, కంటిపరీక్షలను నిర్వహించి వివరాలు నమోదు చేశారు. వైద్యాధికారి నాగరాజు, పాఠశాల హెచ్‌ఎం అరవింద్‌కుమార్, ఏఎన్‌ఎం కృష్ణవేణి ఉన్నారు.

బైండోవర్ ఉల్లంఘించిన మహిళకు రిమాండ్

ఖానాపూర్: మండలంలోని సత్తన్‌పల్లి పంచాయతీ పరిధిలోని రాంరెడ్డిపల్లె గ్రామానికి చెందిన సునీత బైండోవర్ ఉల్లఘించినందుకు సోమవారం రిమాండ్ చేశామని ఎక్సైజ్ సీఐ లక్ష్మణ్‌రావు, ఎస్సై అభిషేకర్ తెలిపారు. ఇటీవల గుడుంబా విక్రయిస్తు పట్టుబడడంతో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. అయినప్పటికి బైండోవర్ ఉల్లఘించడంతో రిమాండ్ చేశామన్నారు.

సంక్షిప్తంగా

పరామర్శ

కడెం: మండలంలోని ధర్మాజీపేట్ పంచాయతీ పరిధిలోని కుర్రగూడెంకు చెందిన నర్సయ్య ఇటీవల మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యులను యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరి సతీశ్ రెడ్డి సోమవారం పరామర్శించారు. నాయకులు జగన్‌రెడ్డి, లింబన్న, యాదగిరి, సత్యం, శేఖర్, చిన్నుపటేల్ తదితరులు ఉన్నారు.

జీవశాస్త్ర ప్రతిభ పరీక్షలు

కడెం: మండలంలోని లింగాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం జీవశాస్త్ర ప్రతిభ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో విద్యార్థులు జీవన జ్యోతి, అమూల్య, సతీశ్, రాకేశ్ ఉత్తమ ప్రతిభ కనబర్చారు. పోటీలను హెచ్‌ఎం వెంకటరమణ, ఉపాధ్యాయులు కిషన్, మహేశ్ పర్యవేక్షించారు.

కష్టపడి చదవాలి

కుంటాల: విద్యార్థులు కష్టపడి చదవాలని ఎస్సై భాస్కరాచారి పేర్కొన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థులు సోమవారం క్షేత్ర పర్యటనలో భాగంగా పోలీస్ స్టేషన్ సందర్శించారు. చట్టాలు, పోలీసుల విధులు, బాధ్యతలు, ఫిర్యాదుల విభాగం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ నవీన్ కుమార్, ఉపాధ్యాయులు నరేశ్, రాజు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

కుంటాల: పర్యావరణ పరిరక్షణ కృషి చేయాలని ఎంఈవో ముత్యం పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శాంతినికేతన్ పాఠశాలలో జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం సందర్భంగా మాట్లాడారు. ప్రిన్సిపాల్ సంతోష్, డైరెక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించండి

కుంటాల: ప్రజలు సకాలంలో ఇంటి, నీటి పన్నులు చెల్లించాలని ఎంపీవో రహీం పేర్కొన్నారు. కుంటాలలో ఇంటి, నీటి పన్నులను సోమవారం వసూలు చేశారు. పన్నులు చెల్లించి పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి రాజబాపు ఉన్నారు.

చెత్త తొలగింపు

ముధోల్: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలో సోమవారం చెత్తాచెదారాన్ని సిబ్బందితో తొలగించారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా పాఠశాల ఆవరణ తరగతి గదులు, హాస్టల్‌లో చెత్త చెదారాన్ని తొలగించినట్లు ప్రిన్సిపాల్ అమృత తెలిపారు. దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



సోన్: మండలంలోని న్యూవెల్మల్ బొప్పారం ఉన్నత పాఠశాలలో 2008–09 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. పాఠశాలలో జరిగిన అపూర్వ సమ్మేళనానికి హాజరయ్యారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి గుర్తులను నెమెరువేసుకున్నారు. రోజంతా సందడి చేశారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. గురువులు గంగారెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నదానం



సూర్య సత్యనారాయణ పటేల్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

తానూరు: మండలంలోని బోరిగాం గుట్ట ప్రాంతంలో గల మహాదేవున్ని ఆలయంలో సోమవారం భైంసా పట్టణానికి చెందిన భక్తుడు సూర్య సత్యనారాయణ పటేల్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను సన్మానించారు. నాయకులు చంద్రకాంత్ యాదవ్, భైంసా మాజీ కోఆప్షన్ సభ్యుడు గజానంద్, రఘునందన్, బాలాజీ గ్రామస్తులు ఉన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

తానూరు: మండలంలోని ఎల్వి పంచాయతీ కార్యాలయంలో మంగళవారం భైంసా ఆరాధన ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యురాలు స్నేహారెడ్డి తెలిపారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు జరిగే శిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.